కథ

# చీకట్లో నల్లపులి

**వాణిశ్రీ**

రాయల్ రెసిడెన్సీ ముందు ఆటో దిగి హడావుడిగా లోపలకు ప్రవేశించింది సరస్వతి.

'బాగా లేటైంది. పిల్లలు ఏడుస్తున్నారో ఏమో?' అనుకుంటూ వెళ్ళింది.

ఆమె వూహించినట్లే కూతురు శ్వేత, కొడుకు సన్నీ వాచ్‌మెన్ రూమ్ దగ్గర దిగులుగా కూర్చుని వున్నారు. కొందరు పిల్లలు పార్కింగ్ ప్లేస్‌లో ఆడుకుంటున్నారు. వాళ్ళతో ఆడుకునే ఓపిక లేక శ్వేత, సన్ని వాళ్లని చూస్తూ వున్నారు.

తల్లిని చూసి శ్వేత, సన్ని బ్యాగులు తగిలించుకుని వచ్చారు. సన్నీ బాగా ఏడ్చినట్లుంది. వాడి బుగ్గల మద కన్నీటి చారలు కనిపిస్తున్నాయి.

"సన్నీ ఎందుకురా ఏడ్చావు?" వాడిని దగ్గరకు తీసుకుంటూ అడిగింది.

"మమ్మీ! వీడు జగన్ దగ్గర చిప్స్ పేకెట్ లాక్కుని తిన్నాడు. వాడు వీడిని కొట్టాడు" చెప్పింది శ్వేత.

"సన్నీ! ఎందుకురా వాడి దగ్గర చిప్స్ పేకెట్ లాక్కుంది? తప్పుకదూ?" మందలిస్తూ అన్నది సరస్వతి.

"ఆకలేసింది మమ్మీ!" నెమ్మదిగా అన్నాడు సన్నీ.

సరస్వతికి కడుపులో దేవినట్లయింది.

'ఛ.. తను పెందరాళే వచ్చి వుంటే తినడానికి ఏదైనా పెట్టేది. ఈ వెధవ జాబ్ మూలంగా పిల్లల్ని చూసుకోవడానికి లేకుండా పోయింది' అనుకుంది.

అప్పటికే రాత్రి ఏడున్నర దాటింది. సరస్వతి ఫ్లాట్ తాళం తీసి లోపలకు వెళ్ళి పిల్లలకు బ్రెడ్ ఆమ్లెట్ వేసిపెట్టింది. వాళ్ళు ఆవురావురుమంటూ తింటుంటే జాలి కలిగింది.

తర్వాత స్నానం చేయించి స్కూల్ డ్రెస్ మార్చింది. పిల్లలు కొంచెంసేపు పుస్తకాలు ముందేసుకుని హోమ్ వర్కు చేసుకుంటూ కూర్చున్నారు.

ఎంత తొందరగా ఇంటికి వద్దామని ట్రై చేసినా లాభం లేకుండా వుంది. ట్రాఫిక్ పెరిగిపోయింది. ప్రైవేటు కంపెనీ జాబ్ కాబట్టి ముందుగా బయల్దేరి రావడానికి వీలుకాదు. ఆఫీసుకి పోయి రావడానికి గంటలు పడుతోంది. సిటీబస్సు ఎడ్లబండికంటే హీనంగా నడుస్తోంది.

సరస్వతి భర్త బ్యాంక్‌లో జాబ్ చేస్తున్నాడు. స్వంత వూళ్ళో పొలాలు వున్నాయి. కౌలు వస్తుంది. అసలు ఆమెకు జాబ్ చేయాల్సిన అవసరం లేదు. ఐతే రమణమూర్తి డబ్బు మనిషి. డిగ్రీ చదివి ఖాళీగా ఉండి ఏం చేస్తావు? అని జాబ్‌లో చేర్పించాడు.

సరస్వతికి జాబ్‌లో చేరిన కొత్తలో బాగానే వుంది. కాని రానురాను తను ఏదో మిస్ అవుతున్నట్లు ఫీలవసాగింది.

ముఖ్యంగా పిల్లలతో గడిపే సమయం చాలడం లేదు. తెల్లవారుజామునే లేవడం, వంట చెయ్యడం పిల్లలకు స్నానాలు చేయించి డ్రెస్‌చేసి టైమ్ టేబుల్ ప్రకారం బుక్స్ సర్ది బ్యాగులో పెట్టడం, టిఫిన్ తినిపించి బాక్సులు బుట్టలో పెట్టి స్కూలు బస్ ఎక్కించడం, తను హడావుడిగా ఆఫీసుకి వెళ్ళడం, మళ్ళీ రాత్రికే ఇంటికి వచ్చేది. పిల్లలు ఆరున్నరకే వచ్చేస్తారు. తను వచ్చేవరకు వాళ్లు బ్యాగులు పెట్టుకుని పార్కింగ్ ఏరియాలో వుంటారు.

మిగిలిన ఫ్లాట్స్‌లో వాళ్ళు పిల్లల్ని చూసి జాలిపడుతుంటారు.

"సన్నీ! మీ మమ్మీ ఇంకా రాలేదా?"

"శ్వేతా! మీ మమ్మీ వచ్చేవరకు మా ఫ్లాట్‌లో కూర్చోవచ్చుగా!" అంటూ వుంటారు.

కానీ వీళ్ళకి ఎవరింట్లోనూ చనువు లేదు. పైగా ఆ సమయానికి వాళ్ళ పిల్లలు ఏదో ఒకటి తింటూ వుంటారు. వాళ్ళయినా ఏదో ఒక రోజైతే చిన్నపిల్లలని పెడతారు. రోజూ వుండే దానికి ఏం చేస్తారు?

"ఏమండీ! నాకు జాబ్‌చిసుగ్గా వుందండీ. పిల్లలు కూడా ఇబ్బంది పడుతున్నారు. మానేద్దామనుకుంటున్నాను" అని అడిగింది.

రమణమూర్తి విసుగ్గా చూశాడు.

"పిల్లలకి ఇబ్బంది ఏమిటి? మార్నింగ్ మనతో పాటే బయల్దేరతారు. మళ్ళీ వచ్చేది ఈవెనింగే గదా! నువ్వు ఇంట్లో వున్నా వాళ్ళని ఏం చూసుకోగలవు? అనవసరంగా వచ్చే డబ్బును పోగొట్టుకోవద్దు" అన్నాడు.

"అది కాదండీ! ఈవెనింగ్ నేను బస్సుల్లోపడి ఇంటికొచ్చేసరికి లేటవుతోంది. పిల్లలు నేను వచ్చేవరకు ఎక్కడుంటారు? పార్కింగ్ ప్లేస్‌లో దిగులుగా కూర్చుని వుంటున్నారు"

"రంచన్‌గా వాళ్ళొచ్చే టైమ్‌కు మనమూ రావాలంటే ఎల్లా? సిటీలో అంతే. అదే అలవాటవుతుంది. చిన్నపిల్లలు కాబట్టి కొంచెం ఇబ్బంది పడతారు. కొంచెం పెద్దయితే వాళ్ళే మనం వచ్చేవరకు హాయిగా ఆడుకుంటూ వుంటారు"

రమణమూర్తి మాటలు విని ఇక అతనితో వాదించి లాభం లేదని వూరుకుంది సరస్వతి.

* * *

ఒక ఆదివారం ముషీరాబాద్‌లో వుండే లాయర్ మాలతి స్నేహితురాలిని చూసి చాలా కాలమైందని సరస్వతి ఫ్లాట్‌కి వచ్చింది.

ఆ సమయంలో రమణమూర్తి ఇంట్లో లేడు. లంచ్ చేసి వెళ్ళిపోయాడు. పిల్లలు ఆడుకోవడానికి చిల్డ్రన్స్ పార్కుకి వెళ్లారు.

"ఏమే! ఫోన్ చెయ్యకుండా వచ్చావు?" మాలతిని చూసి ఆశ్చర్యంగా అడిగింది సరస్వతి.

"నిన్ను సర్‌ప్రైజ్ చేద్దామని" అన్నది మాలతి నవ్వుతూ.

"ఒకవేళ నేను ఇంట్లో లేకపోతే?" అన్నది సరస్వతి.

"నీకంత సీన్ లేదులే" అని సోఫాలో కూలబడింది.


"అవున్లే! నా బతుకు అంతే. వారమంతా సిటీబస్సుల్లో మగ్గి ఆదివారం వస్తే ఇంట్లో చావక ఎక్కడికైనా వెళ్ళడానికి ఓపిక వుంటుందా?" అన్నది సరస్వతి.

"ఏమిటే సంగతులు? అంతా బాగున్నారా?" అడిగింది మాలతి.

"నేను తప్ప అంతా బాగానే వున్నారు" అని తన ఇబ్బందులన్నీ ఏకరువు పెట్టింది సరస్వతి.

"మరి జాబ్ మానేయవచ్చుగా! మీ ఆయన సౌండ్ పార్టీయేగదా? పొలాలు అవీ వున్నాయి. చేసేది బ్యాంక్‌లో జాబ్. మంచి జీతం వస్తుందిగా!" అన్నది మాలతి.

"ఏం చెప్పను? సముద్రంలో ఎన్ని నదులు కలిసినా నిండదని, ఆయనకి ఎంత డబ్బున్నా తృప్తిలేదు. ఎప్పుడూ డిపాజిట్లు, కంపెనీ షేర్లు అని తిరుగుతుంటాడు.



ఇక నేను జాబ్ మానెయ్యడానికి ఎందుకు ఒప్పుకుంటాడు? డిగ్రీలెందుకు సంపాదించుకోవడానికి కాకపోతే అంటాడు. నెలకింత, సంవత్సరానికింత, పదేళ్ళకింత మనకి లాసోయ్ అని లెక్కలేస్తుంటాడు" చెప్పింది సరస్వతి.

"నువ్వు సీరియస్‌గా జాబ్ మానెయ్యాలనుకుంటే మాత్రం నేను చెప్పినట్లు చెయ్యి. తనంతట తనే వెధవ జాబ్ మానెయ్యవోయ్ అంటాడు" అన్నది మాలతి.

"ఏంటే అంత బ్రిలియంట్ ఐడియాలున్నాయా నీ దగ్గర?" ఆశ్చర్యంగా అడిగింది సరస్వతి.

"ఏమనుకున్నావ్? మనది లాయర్ బుర్ర" అని నవ్వింది మాలతి.

"నీ ఐడియా పారితే నీకు మంచి ఫీజు ఇస్తాలే" అన్నది సరస్వతి నవ్వుతూ.


మాలతి ఆమె ఏం చేయాలో చెప్పసాగింది.

* * *

"ఏమండీ మా కొత్తబాస్ మంచివాడు కాదండీ" చెప్పింది సరస్వతి రమణమూర్తి ప్రక్కనే బెడ్‌మీద పడుకుంటూ.

"ఏం?" ఆమె నడుము మీద చెయ్యి వేసి దగ్గరకు లాక్కుంటూ అడిగాడు.

"పెద్ద పెద్ద కళ్ళేసుకుని వళ్ళంతా తడుముతున్నట్లు చూస్తాడండీ! పెళ్ళయిన వాళ్ళమని కూడా లేదు. అందర్నీ పొగుడుతుంటాడండీ! యూ లుక్స్ సో నైస్. యూ ఆర్ బ్యూటీఫుల్. మీరేసుకున్న తెల్ల జాకెట్ లోపల నల్ల బ్రా కాంబినేషన్ సూపర్"



రమణమూర్తి సరస్వతి మాటలకు అడ్డు తగిలి "ఛీ.. ఛీ... వాడొక వెధవలాగున్నాడే" అన్నాడు చిరాగ్గా.

"వెధవేమిటండీ.. వెధవన్నర వెధవనుకోండి. అంతా బాగా అందంగా కనబడాలంట. జిడ్డు ముఖం వేసుకుని వచ్చావేమిటి? మొఖానికి కాస్త పౌడర్ అద్దుకుని రావొచ్చుగా? జడలో ఒక గులాబీ పెట్టుకుని వస్తే ఎంత అందంగా కనబడతావ్? అనవసరంగా ఈ ఆఫీసులో జాబ్‌కి వచ్చావుగాని సినిమాల్లో చేరితే పెద్ద హీరోయిన్ అయిపోయేదానివి"

"ఇక ఆపవోయ్ వెధవ సోది" అని లైటు ఆర్పి వచ్చాడు రమణమూర్తి.

సరస్వతి హెయిర్ స్టైల్ మార్చేసి, పల్చటి చీరలు కట్టడం గమనించాడు రమణమూర్తి.

"ఏంటోయ్! నువ్వెళ్ళేది ఆఫీసులో పని చెయ్యడానికా? ఫ్యాషన్ షోలో క్యాట్‌వాక్‌కా? ఏంటా అంగాంగ ప్రదర్శన?" అసహనంతో అడిగాడు రమణమూర్తి.

"ఏం చెయ్యమంటారు? ముసలమ్మల్లా ఆ ముతక చీరలు ఏంటి? నిండా ముప్పై ఏళ్ళు లేవు? ఎంత గ్లామర్‌గా కనిపించాలి? చూసేవాళ్ళకి ఇంకా చూడాలనిపించాలి. మగవాళ్ళు మిమ్మల్ని చూసి హుషారెక్కువై బాగా పని చేస్తారన్నమాట. అందంగా ఎలా కనిపించాలో తెలియకపోతే బ్యూటీపార్లర్లకి వెళ్ళండి అంటున్నాడండీ" అన్నది సరస్వతి.

రమణమూర్తి పట పట పళ్ళు కొరుక్కుని వెళ్ళిపోయాడు.

"ఏమండీ! మా బాస్ మరీ బరి తెగించాడండీ. ఈమధ్య మేరీ అని కొత్తగా చేరింది ఒకమ్మాయి. దానిమీద పడింది బాస్ కన్ను. ఆ పిల్లకి అర్థంకాని కష్టమైన పనులు అప్పజెప్పి సతాయించాడు. సరిగా చెయ్యకపోతే తిట్టడం మొదలుపెట్టాడు. బాస్‌తో చనువుగా వుంటే చిన్న చిన్న పనులు అప్పగిస్తాడని స్టెనోతో చెప్పించాడు. ఇక పాపం మేరీ బాస్‌ని డిన్నర్లకి పిలుస్తోంది అప్పుడప్పుడు. ఇక బాస్ ఆమెకు పనే చెప్పడం లేదు" అన్నది.

"అంటే ఆ మేరీ వాడికి లొంగిపోయిందన్నమాట" కోపంగా అన్నాడు రమణమూర్తి.

"పాపం ఏం చేస్తుందండీ?"

"అటువంటి వెధవకి లొంగిపోవడంకంటే జాబ్‌కి రిజైన్ చేయడం మంచిది"

"ఏమో! పాపం మేరీ పరిస్థితి ఏమిటో? ఆమె భర్తకి చిన్న జాబ్ ఏమో? ఇద్దరూ జాబ్స్ చేస్తేగాని ఇల్లు గడవ


దేమో? మనకేం తెలుస్తుంది? మేరీ వాళ్లకి స్వంత ఫ్లాట్ గూడా లేదట. అద్దె కట్టాలట" చెప్పింది సరస్వతి.

రమణమూర్తి చిరచిరలాడిపోయాడు.

"ఇటువంటి వాళ్ళే సమాజానికి చీడ పురుగులు. వీళ్ల వల్లే సమాజం పతనమైపోతోంది. శాడిస్ట్ వెధవలు. ఆడదాన్ని ఆటవస్తువనుకుంటారు. స్త్రీని పూజించే దేశం మనది"

నెలలు గడుస్తున్నాయి.

మాలతి అప్పుడప్పుడు ఫోన్ చేసి ఎటువంటి సంఘటనలు చెప్పాలో సలహాలు చెప్తుండేది.




"ఏమోనే! నువ్వు చెప్పినట్లే చేస్తున్నాను. మా బాస్‌ని తిడుతున్నాడు గాని నన్ను జాబ్ మానెయ్యమనడం లేదు" అన్నది సరస్వతి.

"మీ బాస్ కళ్ళు నీ మీద పడ్డాయని చెప్తే తప్ప మీ ఆయనలో చలనం రాదు. ఆ ఎపిసోడ్ యాక్ట్ చెయ్యి. అన్నట్లు డ్రెస్ మార్చు" అన్నది మాలతి.

సరస్వతి నవ్వుతూ వుండిపోయింది.

* * *

సరస్వతి పిల్లల్ని స్కూలుకి పంపేసి ఆఫీసుకి వెళ్ళడానికి రెడీ అయింది.

రమణమూర్తి ఆమెను చూసి నోరు తెరిచాడు.

సరస్వతి టైట్ చుడీదార్ వేసుకుని, మెడకు చున్నీ చుట్టుకుని ముఖానికి అంగుళం మందాన మేకప్ కొట్టుకుని అచ్చం తెలుగు సినిమాలో హీరోయిన్‌లా ఎక్స్‌పోజింగ్‌లో వుంది.

"ఏంటే ఈ వేషం?" సీరియస్‌గా అన్నాడు రమణమూర్తి.

"నేను చీరలో గ్లామర్‌గా లేనటండీ! ఇకనుంచి చుడీదార్లు వేసుకురమ్మన్నాడు బాస్. అన్నట్లు వాళ్ళావిడ వూళ్లో లేదట. ఫస్ట్ షో సినిమాకెళ్తున్నా, కంపెనీ ఇస్తావా? అని అడిగాడండీ" అమాయకంగా చెప్పింది సరస్వతి.

"నువ్వేమన్నావ్?"

"నేనేమంటాను? సరే అన్నానండీ"

"సరే అన్నావా? అంటే వాడితో సినిమాకెళ్తున్నావా?"

"అవునండీ! వెళ్లకపోతే ఎలా? బాస్ గదా!"

"ఈరోజు సినిమాకి రమ్మంటాడు, రేపు లాడ్జికి రమ్మంటాడు. వాడుట్టి వుమనైజర్‌లా వున్నాడు. వాడి మాట వినకు 'నో' అని చెప్పు"

"చెప్తే ఎలాగండీ?"

"ఎలాగంటే?"

"మీకు తెలీదండీ! సతాయిస్తాడు. అందరి ముందు చండాలంగా కామెంట్స్ చేస్తాడు" కళ్ళు దించుకుని విచారంగా అన్నది.

"ఐతే మానెయ్ వెధవ జాబ్" సీరియస్‌గా అన్నాడు రమణమూర్తి.

"సరేనండి. మీ ఇష్టం" లోలోపల సంబరపడుతూ పైకి అమాయకత్వం నటిస్తూ అన్నది సరస్వతి.

సరస్వతి బస్టాండ్‌వైపు బయల్దేరింది.

"మళ్ళీ ఎక్కడికే! జాబ్‌కి రిజైన్ చెయ్యమన్నారుగా!" చిరాకుగా అన్నాడు రమణమూర్తి.

"రిజైన్ చెయ్యడానికే వెళ్తున్నానండీ" అన్నది సరస్వతి.

"సరే! ఆ చండాలపు డ్రెస్ మార్చుకుని, చీర కట్టుకుని వెళ్ళు. రిజిగ్నేషన్ లెటర్ వాడి మొఖాన కొట్టిరా!" కోపంతో అన్నాడు రమణమూర్తి.

"అలాగేనండి" అన్నది సరస్వతి.

రమణమూర్తి బైక్ ఎక్కి వెళ్ళిపోయాడు.

సరస్వతి ఇంట్లోకి వెళ్ళి డ్రెస్ మార్చుకుని వూపిరి పీల్చుకుంది.

మాలతికి ఫోన్ చేసింది.

"నీ సలహా గ్రాండ్ సక్సెస్. మా ఆయన జాబ్‌కి రిజైన్ చెయ్యమన్నారే"

"మరి లాయర్ సలహా అంటే ఏమనుకున్నావ్? మరి నా ఫీజు?" అడిగింది మాలతి.

"రేపు సండే లంచ్‌కి రావే. అదే నీకు ఫీజు" నవ్వుతూ చెప్పింది సరస్వతి.

"సరే వస్తాగాని, ఇటువంటి కేసులుంటే నాకు అప్పగించు. ఫీజు గుంజి సలహాలు ఇస్తాను" అన్నది మాలతి.

"కేసులు దొరికితే నీ దాకా రానిస్తానా? ఇటువంటి కేసులు ఎలా డీల్ చేయాలో అర్థమైందిలే! చీకట్లో నల్లపులి వుందని బెదిరించాలి. అంతేగా!" అని పకపక నవ్వింది సరస్వతి.

"ఓసి దుర్మార్గురాలా! నా ఐడియాలు కొట్టేసి బిజినెస్ చేసుకుంటావా?" అన్నది మాలతి.

"అందుకే అన్నారు తెలివి ఎవడబ్బ సొమ్మూ కాదని" అన్నది సరస్వతి నవ్వుతూ.

## హాట్ హాట్ సదా!

'జయం' సినిమాలో ఎంతో ఒద్దిగ్గా ఎక్స్‌పోజింగ్ లేకుండా కనిపించిన సదా ఆ తర్వాత వచ్చిన కొన్ని సినిమాల్లో క్రమంగా కొద్దోగొప్పో రొమాంటిక్‌గా కనిపిస్తూ వచ్చింది. అయితే రాబోయే 'టక్కరి' సినిమాలో హాట్ హాట్ డ్రెస్సింగ్‌లు గెటప్‌తో ప్రేక్షకులకు అందాల విందు చేయబోతోందని సినీ వర్గాల కథనం. నితిన్-సదా ఇద్దరికీ మంచి బ్రేక్ కావాల్సిన అవసరం వుంది. 'టక్కరి'లో సదా అందాల ఆరబోత ఆమె కెరీర్‌కి ఎంతవరకూ కలిసొస్తుందో చూడాలి!

